నిజం మా నైజం..!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 5 | సంచిక: 50 | ఆదివారం, 19 జూలై 2026 | పేజీలు - | వెల : 3/-




# స్కూల్ యూనిఫామ్ రెడీ

## ఆగస్టు 15లోపు విద్యార్థులకు పంపిణీ

- 27 లక్షల మంది ప్రభుత్వ, గురుకుల విద్యార్థులకు కొత్త దుస్తులు
- స్టూడెంట్ కిట్లు కూడా..
- రూ.687.78 కోట్లు విడుదల
- యూనిఫామ్ కుట్టు పనులు వేగవంతం

**హైదరాబాద్,** వాస్తవ తెలంగాణ ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. ఆగస్టు 15లోపు రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలతో పాటు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటికే రూ.687.78 కోట్లు విడుదల చేసింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతలయూనిఫాంలతోపాటుబూట్లు,సాక్సులు, బెల్ట్‌లు అందించనున్నారు. గురుకుల విద్యార్థులకు వీటితో పాటు స్కూల్ బ్యాగ్, ట్రంక్ బాక్స్, ప్లేట్, గ్లాస్, ట్రాక్‌సూట్, నైట్‌డ్రెస్ తదితర అవసరమైన సామగ్రిని అందజేయనున్నారు. తొలిసారిగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా బెల్ట్, బూట్లు, సాక్సులతో కూడిన కిట్లను పంపిణీ చేయనున్నారు.



### ఒక్కో జత కుట్టుగూళ్లు రూ.75 చెల్లింపు

యూనిఫాంల తయారీని మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించిన ప్రభుత్వం, ఒక్కో జత కుట్టినందుకు రూ.75 చెల్లిస్తోంది. దీంతో మహిళా సంఘాలకు ఉపాధి లభించడంతో పాటు చేనేత, వస్త్ర రంగానికీ ప్రోత్సాహం లభించనుంది. మొత్తం 27 లక్షల మంది విద్యార్థుల కోసం 2.97 కోట్ల మీటర్ల వస్త్రాన్ని సేకరించినట్లు అధికారులు తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ ఆగస్టు 13లోపు యూనిఫాంల తయారీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కస్తూర్బా బాలికా విద్యాలయాల్లోని 85 వేల మంది విద్యార్థులకు ఇప్పటికే యూనిఫాంల పంపిణీ పూర్తయింది.

### కిట్లలో ఇవి..

విద్యార్థుల కిట్లలో రెండు జతల యూనిఫాంలు, పీటీ డ్రెస్, తెల్ల యూనిఫామ్, ట్రాక్‌సూట్, నైట్‌డ్రెస్, బూట్లు, సాక్సులు, బెల్ట్, టై, ఐడీ కార్డు, టవల్ ఉంటాయి. గురుకుల విద్యార్థులకు అదనంగా దుప్పటి, పరుపు, ట్రంక్ బాక్స్, ప్లేట్, గ్లాస్, గిన్నె, కప్పు, చెంచా, స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, స్టేషనరీ సామగ్రిని అందించనున్నారు. అలాగే 6, 7వ తరగతి విద్యార్థులకు షార్ట్ ప్యాంట్ల స్థానంలో ఫుల్‌ప్యాంట్లను అందించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.




# నేడే సరూర్‌నగర్‌లో యువ సంగ్రామ సదస్సు

హైదరాబాద్: **వాస్తవ తెలంగాణ** బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సు శనివారం ఉదయం పది గంటలకు జరగనుంది. అయితే ఈ సదస్సు నిర్వహణకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు అనుమతి ఇవ్వడంతో యువ సంగ్రామ సదస్సుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఎక్స్ ద్వారా స్పందించారు. యువ సంగ్రామ సదస్సును అడ్డుకుని, నిరుద్యోగ యువత గొంతు నొక్కుదామని ప్రయత్నించిన రేవంత్ రెడ్డి కుట్ర విఫలమైందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తే హైకోర్టు ప్రజాస్వామ్య హక్కులను కాపాడుతూ సదస్సుకు అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్ని అవరోధాలు సృష్టించినా యువత తరఫున బీఆర్ఎస్ పార్టీ గళం విప్పుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. యువతీ యువకులారా తరలిరావాలనీ, సరూర్‌నగర్ స్టేడియం వేదికగా కాంగ్రెస్ మోసాలను ఎండగడదామని ఆయన పిలుపునిచ్చారు. రేవంత్ సర్కార్ మెడలు వంచుదామనీ, హామీల అమలుకు జంగ్ సైరన్ పూరిద్దామని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ అవలంభిస్తున్న విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సరూర్‌నగర్ స్టేడియంలో శనివారం జరిగే “యువ సంగ్రామ సదస్సు”కు పెద్ద సంఖ్యలో తరలి రావాలని బీఆర్ఎస్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. సరూర్ నగర్ స్టేడియం వద్ద బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డికి యువత అంటే ఎందుకింత భయమని ప్రశ్నించారు. కాంగ్రెస్ తెలంగాణ ఉద్యమకారులను అవమానించిందని అన్నారు. రాజ్యాంగ పీఠిక, ప్రాథమిక హక్కులు సీఎం రేవంత్‌రెడ్డి చదువుకోవాలని సూచించారు. హక్కులు కాపాడాలని రాహుల్ గాంధీ అంటుంటే, రేవంత్ రెడ్డి కాలరాస్తున్నారని విమర్శించారు. న్యాయస్థానం తీర్పును గౌరవిస్తామని చెప్పారు.

# స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు

**హైదరాబాద్: వాస్తవ తెలంగాణ** మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ ఎస్ఆర్‌బీ) ద్వారా ఎంపికైన 247 స్టాఫ్ నర్సులకు ప్రభుత్వం నియామక పత్రాలను అందజేసింది. శుక్రవారం హైదరా బాద్‌లోని కొమురం భీం ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ 2011 తర్వాత ఈఎస్ఐ శాఖలో తొలిసారి ప్రత్యక్ష నియామక ప్రక్రియను చేపట్టామని తెలిపారు. కార్మికులు, వారి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారనీ, అందుకే సిబ్బంది కొరతను పూర్తిగా తొలగించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని సుమారు 20 లక్షల మంది బీమా పొందిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులు కలిపి సుమారు 75 లక్షల మంది ఈఎస్ఐ ద్వారా లబ్దిపొందుతున్నారని చెప్పారు. ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలంటే వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, మందులు, ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉండాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈఎస్ఐ వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దానిపై సమగ్రంగా సమీక్షించామని తెలిపారు. సుమారు రూ.72 కోట్ల బకాయిలను విడుదల చేసి మందుల కొరతను నివారించడంతోపాటు, నిర్వహణ, సేవల మెరుగుదలకు అదనపు నిధులను కేటాయించామని వివరించారు. రాష్ట్రంలోని అన్ని ఈఎస్ఐ ఆస్పత్రు లను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇటీవల కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో కూడా ఈ అంశాలపై చర్చించినట్టు తెలిపారు. సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిపై ఉన్న భారాన్ని తగ్గించేందుకు రామచంద్రాపురం ఈఎస్ఐ ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్, కార్డియాక్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రత్యేక వైద్య సేవలను విస్తరిస్తున్నామని తెలిపారు. నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో డయాలసిస్ సేవలను బలోపేతం చేసి కార్డియాక్ సేవలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి అనుగుణంగా రామగుండం, శంషాబాద్, మహబూబ్‌నగర్, కొత్తగూడెం ప్రాంతాల్లో కొత్త ఈఎస్ఐ ఆస్పత్రుల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. 12 నుంచి 18 నెలల్లో రాష్ట్రంలోని అన్ని ఈఎస్ఐ ఆస్పత్రులను దశలవారీగా ఆధునికీకరిస్తామని వెల్లడించారు. ఈఎస్ఐ శాఖలో మొత్తం 599 పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభించినట్టు తెలిపారు. త్వరలోనే 120 మంది సివిల్ అసిస్టెంట్



సర్జన్లు, 6 మంది డెంటల్ సర్జన్లు, 99 మంది ఫార్మసిస్టులు, 34 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 54 మంది ఏఎన్ఎంలు సహా ఇతర పారామెడికల్ సిబ్బంది నియామకాలను కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ఈఎస్ఐ సేవల్లో ఎక్కడా సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నాచారం ఈఎస్ఐలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో నర్సింగ్ విద్యను మరింత బలోపేతం చేయడమే ఈ నిర్ణయానికి ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

# చరిత్ర--వారసత్వ సంపదకు మెదక్ నిలయం

**ఏడుపాయలు, మెదక్ ఖిల్లా, సీఎస్ఐ కేథడ్రల్ సందర్శన..**
**జిల్లా పర్యాటక అభివృద్ధిపై ప్రశంసలు.. భవిష్యత్ చిత్రీకరణలకు మెదక్‌కు ప్రాధాన్యం ఇస్తానన్న మా అసోసియేషన్ అధ్యక్షుడు, సినీ నటుడు--నిర్మాత మంచు. విష్ణు**





**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్,టౌన్ :-** మెదక్ జిల్లా చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి నిలయమని మా అసోసియేషన్ అధ్యక్షుడు, సినీ నటుడు--నిర్మాత మంచు విష్ణు అన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అధికారులు చేపడుతున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. శనివారం జిల్లాలో పర్యటించిన ఆయన ఏడుపాయల వనదుర్గ భవానీ ఆలయం, మెదక్ ఖిల్లా, ప్రపంచ ప్రసిద్ధ సీఎస్ఐ కేథడ్రల్ చర్చిని సందర్శించారు.ఏడుపాయల ఆలయానికి చేరుకున్న మంచు విష్ణుకు అదనపు కలెక్టర్ నగేష్ మొక్కను అందించి ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతించి అమ్మవారి దర్శనం కల్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర, విశిష్టతను అదనపు కలెక్టర్ నాగేష్,జిల్లా అధికారులు వివరించారు.అనంతరం మెదక్ ఖిల్లాను సందర్శించిన మంచు విష్ణు కోట నిర్మాణ వైభవం, చారిత్రక విశేషాలను ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం ప్రపంచ ప్రసిద్ధ సీఎస్ఐ కేథడ్రల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అక్కడి నిర్మాణ శైలిని అభినందించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలోని అనేక దేశాలకు లేని గొప్ప చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపద భారతదేశానికి ఉందని, అలాంటి సంపదను కాపాడి భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పుస్తకాల్లో చదివిన చరిత్రను ప్రత్యక్షంగా చూసినప్పుడు దాని గొప్పతనం మరింత స్పష్టమవుతుందని పేర్కొన్నారు. మెదక్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం మాస్టర్ ప్లాన్ రూపొందించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ఏడుపాయలు, మెదక్ ఖిల్లా, సీఎస్ఐ కేథడ్రల్ వంటి ప్రాంతాలను దేశవ్యాప్తంగా మరింత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాంతాలు పర్యాటకంగా అపార అవకాశాలు కలిగి ఉన్నాయని అభిప్రాయపడ్డారు.భవిష్యత్తులో తాను నటించే లేదా నిర్మించే చిత్రాల్లో మెదక్ జిల్లాలోని చారిత్రక, ప్రకృతి రమణీయ ప్రాంతాలను చిత్రీకరణ వేదికగా వినియోగించే ప్రయత్నం చేస్తానని మంచు విష్ణు వెల్లడించారు. దీనివల్ల జిల్లాకు మరింత గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖ అధికారి రమేష్, మున్సిపల్ కమిషనర్ నవీన్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, డీఎస్పీ ప్రసన్న కుమార్, కౌన్సిలర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# వర్షాలు తక్కువే.. మెట్ట పంటలే మేలు

**ఎల్‌నినో ప్రభావంతో వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి..**
**శాస్త్రవేత్తల సూచనల మేరకు సాగు విధానాలు మార్చుకోవాలని పిలుపు..**
**రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు, పారిశ్రామిక, భూగర్భ వనరుల శాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి..**






**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ ప్రతినిధి:-** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశాలున్నందున రైతులు వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు దూరంగా ఉండి, తక్కువ నీటితో సాగయ్యే మెట్ట, ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు, పారిశ్రామిక, భూగర్భ వనరుల శాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.శనివారం చేగుంట మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన ఎల్‌నినో వ్యవసాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఇప్పటికే రైతు భరోసా ద్వారా అండగా నిలిచిందన్నారు. జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, భూగర్భ జలాల లభ్యత తగ్గడం వల్ల వరి సాగు అనుకూలం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందుగానే ఎల్‌నినో ప్రభావంపై విస్తృత ప్రచారం చేపట్టిందని, అయినప్పటికీ కొందరు రైతులు వరి సాగుకే మొగ్గ చూపుతున్నారని, ఇప్పటికైనా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. సదస్సులో రైతులు కోతుల బెడద, ఆరుతడి పంటలకు సబ్సిడీల అవసరం వంటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. “వరి వద్దు.. ప్రత్యామ్నాయ పంటలే ముద్దు” అనే నినాదంతో జిల్లావ్యాప్తంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని రైతు వేదికల్లో ఎల్‌నినోపై సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ మెట్ట పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో బావయ్య, డీడబ్ల్యూఓ హేమభార్గవి, జిల్లా వ్యవసాయ అధికారి, ప్రజాప్రతినిధులు, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాగవరం ఉన్నత పాఠశాలలో ఘనంగా తల్లిదండ్రుల సమావేశం






**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ సర్కిల్ లో జిల్లా పరిషత్ నాగవరం ఉన్నత పాఠశాలలో ఘనంగా తల్లిదండ్రుల సమావేశం శనివారం ఉదయం ప్రధానోపాధ్యాయులు పి సి రాములు ప్రారంభించారు. విద్యార్థుల చదువు, ప్రవర్తనను తల్లిదండ్రులతో పాఠశాల ఉపాధ్యాయులు చర్చించారు. గత రెండు సంవత్సరాల నుంచి కీసర మండలంలోనే ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులు అవుతున్నారనీ, ఆ సరళిని కొనసాగించడానికి పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరం కలిసి కృషి చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కూడా ఉపాధ్యాయుల కృషి బాగా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరవింద్ కుమార్, మాలోత్ నాయక్, ఏ.సంధ్యా రాణి, వందన, అజీజ్ అహ్మద్, రఘు, సుమతి, అర్చన, సంజయ్ రాణీ, కౌసల్య, పద్మా, పాండురంగారెడ్డి,సరిత, కమల, రమా సత్యశ్రీ,, గాయత్రీ సుప్రజ, విద్యా వాలంటీర్ స్వప్న, ఆల్క ,పావని,పవిత్ర, విశాలిలు పాల్గొన్నారు.

# దోస్త్ స్పెషల్ ఫేజ్ షెడ్యూల్ విడుదల

**20 నుంచి రిజిస్ట్రేషన్లు.. 27 వరకు వెబ్ ఆప్షన్లు**




**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్,టౌన్ :-** మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో ప్రవేశాల కోసం దోస్త్ స్పెషల్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదలైంది.ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హుస్సేన్ శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఇప్పటివరకు దోస్త్‌లో నమోదు చేసుకోని విద్యార్థులతో పాటు, ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసిన వారు కూడా ఈ నెల 20 నుంచి 26 వరకు స్పెషల్ ఫేజ్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 20 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని, జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలని సూచించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులు ఆగస్టు 1లోపు అసలు ధ్రువపత్రాలను కళాశాలలో సమర్పించి ప్రవేశం ఖరారు చేసుకోవాలని తెలిపారు.దోస్త్ సమన్వయకర్త సురేందర్ రావు మాట్లాడుతూ.. ఇప్పటికే దోస్త్‌లో నమోదు చేసుకున్న విద్యార్థులు ఎలాంటి రుసుము లేకుండా స్పెషల్ ఫేజ్‌లో పాల్గొనవచ్చన్నారు. ఇప్పటివరకు నమోదు చేసుకోని విద్యార్థులు రూ.400 చెల్లించి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ః

# చందిప్ప మరకత లింగేశ్వరుడి సన్నిధిలో మాజీ మంత్రి ప్రసన్న కుమార్ రెడ్డి..



**శంకర్ పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో వెలిసిన 11వ శతాబ్దపు మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో శనివారం అర్చకులు సాయి శివ ఆధ్వర్యంలో మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ కడకంచి కుమార్ యాదవ్.. మాజీ మంత్రిని స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేసి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకోవడం ఎంతో అనుభూతినిచ్చిందన్నారు. స్వామి వారి దయతో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, స్వామి వారిని కోరుకున్నట్టు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ క్యాషియర్ ప్రశాంత్ గౌడ్, జనార్ధన్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల నుంచే గొప్ప విజయాలు

**చేగుంటకు డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి చేస్తా. సంపాదనలో కొంత భాగాన్ని సమాజానికి వెచ్చించడం ప్రతి ఒక్కరి బాధ్యత మంత్రి వివేక్ వెంకటస్వామి.**




**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్, ప్రతినిధి:–** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకుని క్రమశిక్షణతో కష్టపడితే దేశంలోనే అత్యున్నత స్థానాలను చేరుకోవచ్చని రాష్ట్ర శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు) మరియు గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. మెదక్ జిల్లా చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం సురేఫ్య్ స్కూల్ కిట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు ఉచిత స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పుడు నాణ్యమైన విద్యతో పాటు ప్రపంచ స్థాయి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఐఐటీలు, ఐఐఐటీలు, మెడికల్, ఇంజినీరింగ్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం ఆనందదాయకమన్నారు. చేగుంట పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఐఐఐటీలో ప్రవేశం పొందడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని ప్రశంసించారు. ప్రతి విద్యార్థి డాక్టర్, ఐఏఎస్, ఇంజినీర్ వంటి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. విజయానికి క్రమశిక్షణ, కష్టపడి పనిచేసే తత్వమే మూలమని చెప్పారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోందని, సీఎస్ఆర్ నిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయమన్నారు. విద్యాభివృద్ధికి సేవలందిస్తున్న సంకల్ప్ సంస్థను అభినందించిన మంత్రి, వేలాది మంది విద్యార్థులకు విద్యా సహాయం అందించడం సామాజిక బాధ్యతకు నిదర్శనమన్నారు. తన తండ్రి వెంకటస్వామి స్ఫూర్తితోనే సమాజానికి తిరిగి ఇవ్వాలనే భావన అలవడిందని, సంపాదనలో కొంత భాగాన్ని సమాజానికి వెచ్చించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) విస్తరిస్తున్న నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధి అత్యంత అవసరమని, రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు, టామ్‌కామ్ ద్వారా యువతకు ఆధునిక నైపుణ్యాలు, విదేశీ భాషల శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. చేగుంట ప్రజల చిరకాల కోరిక అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, కళాశాల మంజూరుకు తనవంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.




ఈకార్యక్రమంలో పాఠశాల, ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాళ్లు, సురేఫ్య్ సంస్థ ప్రతినిధులు, సంకల్ప్ సంస్థ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వరికి ప్రత్యామ్నాయం.. ఆయిల్ పామ్‌తో అధిక ఆదాయం

**మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల వైపు రైతులు అడుగులు వేయాలి. సుస్థిర వ్యవసాయమే భవిష్యత్.. ఆయిల్ పామ్ సాగును విస్తరించాలి. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ ప్రతినిధి :–** జిల్లాలో రైతులందరూ సుస్థిర వ్యవసాయం వైపు అడుగులు వేస్తూ వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేపట్టి అధిక ఆదాయం పొందాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. శంకరంపేట(ఆర్) మండలం సూరారం గ్రామంలో రైతులు సత్యనారాయణ, రాజు, జగదీశ్‌ల మూడేళ్ల ఆయిల్ పామ్ తోటను శనివారం సందర్శించి తొలి దిగుబడి కోతను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 2023–24 నుంచి ఇప్పటివరకు 1,857 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరిగిందన్నారు. 2026–27 సంవత్సరానికి 2,500 ఎకరాల లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 693 ఎకరాల్లో భూమి సిద్ధం చేసి, 354 ఎకరాల్లో తోటలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్కెట్‌లో నిరంతర డిమాండ్ ఉన్న పంటల్లో ఆయిల్ పామ్ ఒకటని, ప్రభుత్వం ప్రత్యేక చట్టం ద్వారా ఈ పంటకు ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. మొక్కలపై రాయితీతో పాటు నాలుగేళ్లపాటు తోట నిర్వహణ, అంతర పంటల సాగుకు ఆర్థిక సాయం నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.



ఒక రైతుకు గరిష్ఠంగా 12.50 ఎకరాల వరకు డ్రిప్ సేద్య పరికరాలపై సబ్సిడీ లభిస్తుందని చెప్పారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన నాలుగో ఏడాది నుంచి ఎకరానికి 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందని, ప్రస్తుతం టన్ను గెల ధర రూ. 23,852 ఉండటంతో ఎకరానికి సంవత్సరానికి సుమారు రూ. 2.38 లక్షల ఆదాయం, ఖర్చులు పోను దాదాపు రూ. 2 లక్షల వరకు నికర లాభం పొందే అవకాశం ఉందని వివరించారు. వరి ఎకరానికి అవసరమయ్యే నీటితో ఐదు ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేయవచ్చన్నారు. ఈ పంటను సంబంధిత కంపెనీ నేరుగా కొనుగోలు చేయడం వల్ల మధ్యవర్తుల సమస్య ఉండదని, కోతులు, దొంగల బెడద కూడా తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. తొలి నాలుగేళ్లలో అంతర పంటల ద్వారా ఆదాయం పొందవచ్చని, అనంతరం కోకో, వక్క వంటి నీడను తట్టుకునే పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ సింగ్, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, లివ్ పామ్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, మైక్రో ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# సరూర్నగర్ బైలు దేరిన కంటోన్మెంట్ బి ఆర్ ఎస్ నాయకులు



**వాస్తవ తెలంగాణా డైలీ న్యూస్ /.** నేడు సరూర్నగర్ లో జరిగే యువ సంగ్రామ సదస్సు సభకు పెద్ద ఎత్తున కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి యువతతో బయలుదేరి వెళ్లిన మన్నే క్రిశాంక్ కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇస్తానన్న రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేయడంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైందని ధ్వజమెత్తారు. తప్పుడు హామీలతో అధికార గద్దెనెక్కి తెలంగాణ ప్రజలతో పాటు అన్ని వర్గాలను మోసం చేస్తుందని అన్నారు. తాము ఇస్తాన అన్ని హామీలు అమలు చేసేంతవరకు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్ పిలుపుమేరకు ఉద్యమిస్తామని, ఎస్సీ, బీసీ, మైనార్టీల, డిక్లరేషన్ విషయంలో ఇప్పటివరకు ఊసే లేదని ఈ పోరాటం కేవలం ఆరంభమేనని రేవంత్ రెడ్డిని గద్ద దించే వరకు పోరాడుతామని విమర్శించారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో హెలికాప్టర్లు కొనుక్కొని రాహుల్ గాంధీ దేశ పర్యటనకు వాడుతున్నారని ఆరోపించారు. యువతతో కలిసి పికెట్ ప్రధాన రహదారిపై ఉన్న అంబేద్కర్ బాబు జగ్జీవన్ విగ్రహాల వద్ద యువతకు ఇస్తానన్న ఈ పోస్టర్ను యువతతో కలిసి చింపి గాలిలో ఎగరవేసి నిరసన తెలిపారు. అనంతరం అక్కడ నుండి ఆరు బస్సుల్లో యువతను సరూర్నగర్ గ్రౌండ్ కు కలిసి బయలుదేరారు. కంటోన్మెంట్ బోర్డ్ మాజీ బోర్డు సభ్యుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ అన్నం పెట్టే రైతులతో పాటు నిరుద్యోగ యువతకు ఇస్తాన ఉద్యోగాలతో పాటు మహిళలను ముందర పెట్టి కోటి మహిళలను కోటీశ్వరుని చేస్తానని తప్పుడు హామీలతో మభ్యపరుస్తున్నారని ఆరోపించారు. మహిళ యువతకు స్కూటీలు ఇస్తామన్న హామీ ఏమేమి ఉందని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తుగ్లక్ పాలనతో నోటికి వచ్చినట్లు వారు చావాలి రక్తం చెల్లి పంటలు పండించాలని ప్రపంచంలో ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి మాట్లాడి ఉండాలని అటువంటి వ్యాఖ్యలను మాట్లాడుతున్నారని తన మానసిక పరిస్థితి ఏ రకంగా ఉందో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

# శంకర్ పల్లి మున్సిపల్ లో పలు వార్డులలో అండర్ డ్రైనేజ్ పనులను ప్రారంభించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య..

**శంకర్ పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో శనివారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలు యాదయ్య అండర్ డ్రైనేజ్ పనులకు శంకుస్థాపనలు చేశారు. మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో రూ. 10 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన చేశారు. 8వ వార్డు పతేపురం ఎస్సీ కాలనీలో పది లక్షల 90 వేల రూపాయలతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. 11 వ వార్డులో ఐదు లక్షల రూపాయలతో



నిర్మిస్తున్న డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి ఎంతో పాటుపడుతున్నదని తెలిపారు. కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు కేటాయిస్తుందని చెప్పారు. వార్డు కౌన్సిలర్లు తమ తమ వార్డులలో సమస్యలు ఉంటే వెంటనే వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి, శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకూర్త గోవిందమ్మ గోపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ యోగేష్, ఆయా వార్డులకు కౌన్సిలర్లు, కో- ఆప్షన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ జనసేన లీగల్ టీం సమావేశం నిర్వహణ..



**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం, మణికొండలో తెలంగాణ రాష్ట్ర లీగల్ టీం సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ తల్లూరి మరియు తెలంగాణ ఇన్‌చార్జ్ మెమోరీ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో న్యాయవాదులు హాజరై పార్టీ బలోపేతం, న్యాయపరమైన అంశాల్లో ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడం, ప్రజా సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన పోరాటాలను మరింత వేగవంతం చేయడం వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో లీగల్ టీం పాత్ర అత్యంత కీలకమని నాయకులు పేర్కొన్నారు. రాజ్యాంగ విలువల పరిరక్షణ, ప్రజాస్వామ్య హక్కుల కాపాడటం, సామాన్య ప్రజలకు న్యాయ సహాయం అందించడం, ప్రజా సమస్యలపై న్యాయపరమైన చర్యలు చేపట్టడంలో జనసేన లీగల్ టీం సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని నలుమూలల నుంచి వచ్చిన న్యాయవాదులు తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడిస్తూ పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత బలోపేతం చేయడంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని తెలిపారు. సమావేశం ఉత్సాహభరితంగా సాగి, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకుంటూ విజయవంతంగా ముగిసింది.

# శంకర్ పల్లిలో ఈనెల 20న జగన్నాథుడి రథయాత్ర..



**శంకర్ పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** శంకర్ పల్లి మున్సిపల్ కేంద్రంలో ఈనెల 20న జగన్నాథుడి రథయాత్ర అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు హిందూ ఐక్యవేదిక సభ్యులు తెలిపారు. జగన్నాథుని రథయాత్ర శంకర్ పల్లి పట్టణంలోని గీతా మందిరం పురవీధుల గుండా ప్రారంభమై ప్రధాన చౌరస్తా మీదుగా మళ్లీ గీతా మందిరం దేవాలయానికి చేరుకుంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ రథయాత్రలో పాల్గొని దేవుని కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

# గిన్నిస్ బుక్‌లోకి ఎక్కిన కుర్వ సాయి సహస్ర..

## మెడల్, సర్టిఫికెట్ అందజేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య..



**శంకర్ పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** కరాటే రంగంలో శంకర్ పల్లికి చెందిన విద్యార్థిని అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. స్థానిక రేవతి హైస్కూల్ విద్యార్థిని కుర్వ సాయి సహస్ర, కరాటే మాస్టర్ రవీందర్‌తో కలిసి ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. గత ఏప్రిల్ 26న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 'విజన్ మార్షల్ ఆర్ట్స్' ఆధ్వర్యంలో మహా కరాటే ప్రదర్శన నిర్వహించారు. సుమారు 1212 మంది కరాటే యోధులు పాల్గొన్న ఈ ప్రదర్శనలో, సాయి సహస్ర 20 నిమిషాల పాటు ఆగకుండా అద్భుతమైన కరాటే విన్యాసాలు చేసి అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనకు గానూ తాజాగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్, మెడల్స్ విడుదలయ్యాయి. **ఘనంగా సన్మానం:** గిన్నిస్ రికార్డు సాధించిన విద్యార్థిని సాయి సహస్రను శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మున్సిపల్ చైర్మన్ సాతా ప్రవీణ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థినికి గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్, మెడల్ అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇలాంటి అంతర్జాతీయ వేదికలపై రాణించడం గర్వకారణమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థిని తండ్రి (ఆర్టీసీ కండక్టర్) ఇందూర్ రాజు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని ఓటర్ల జాబితా కార్యక్రమాన్ని పరిశీలించిన చేవెళ్ల ఆర్డిఓ పార్థసింహారెడ్డి..



**శంకర్ పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని ఓటర్లు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను, పోలింగ్ బూత్లను శనివారం చేవెళ్ల ఆర్డిఓ పార్థసింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకొని ప్రతి ఒక్కరు సర్ ఫారాలు పూర్తిచేసి బీఎల్ఓ లకు, లేదా మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

# మెదక్‌ను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతున్న ప్రభుత్వం

**ఏడుపాయలు--ఖిల్లా--సీఎస్ఐ చర్చి అభివృద్ధితో జిల్లాకు జాతీయ స్థాయి గుర్తింపు.**
**ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కృషి ఫలితమే పర్యాటక రంగానికి ఊపు.**
**పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. గంగాధర్**



**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి సంపదకు నిలయమైన మెదక్ జిల్లాను రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మెదక్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. గంగాధర్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజాపాలనలో భాగంగా మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి. రోహిత్ కృషితో ఏడుపాయల వనదుర్గ ఆలయ అభివృద్ధికి రూ.29 కోట్ల నిధులు మంజూరయ్యాయని, దీంతో ఆలయ అభివృద్ధి పనులకు మార్గం సుగమమైందన్నారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన మెదక్ ఖిల్లాకు కూడా ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు కల్పిస్తూ అభివృద్ధి చర్యలు చేపడుతోందన్నారు.ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన మెదక్ సీఎస్ఐ కేథడ్రల్ చర్చి శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సందర్శించి, రూ.30 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జిల్లాకు గర్వకారణమన్నారు. పోచారం అభయారణ్యం, పోచారం డ్యామ్, జింకల పార్క్, ఏడుపాయలు, మెదక్ ఖిల్లా, సీఎస్ఐ చర్చిని ఒకే టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేసి మెదక్‌ను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కృషి ఫలితంగానే ఇటీవల సినీ నటుడు మంచు విష్ణు మెదక్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించారని, రానున్న రోజుల్లో మరింత మంది సినీ, క్రీడా, సాంస్కృతిక ప్రముఖులు మెదక్‌ను సందర్శించే అవకాశం ఉందన్నారు. దీంతో జిల్లాకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రూ.60 కోట్ల రూపాయల కుచ్చు టోపీ పెట్టి పారిపోయిన దంపతుల అరెస్ట్ చేసిన ఎస్.ఓ.టి పోలీసులు..



**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం కుషాయిగూడ డివిజన్ చక్రిపురం లో గత కొద్ది రోజుల క్రితం కుషాయిగూడకు చెందిన వ్యాపారవేత్త పబ్బ చంద్రశేఖర్ అధిక వడ్డీలు ఇస్తానని నమ్మించి పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు సేకరించి, అనంతరం కనిపించకుండా పోయాడని బాధితులు ఆరోపించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.60 కోట్ల వరకు మోసం జరిగినట్లు వారు తెలిపారు. ఈ మోసానికి సుమారు 80 మంది వరకు బాధితులైనట్లు సమాచారం. తమ కష్టార్జితం తిరిగి ఇప్పించాలని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులందరూ ఈరోజు మల్కాజిగిరి సీపీ ని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, తమకు న్యాయం చేయడంతో పాటు తాము కోల్పోయిన డబ్బును తిరిగి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసు అధికారులను కోరారు. పూర్తి వివరాలు పోలీసులు తెలపాల్సి ఉంది

# సదాశివపేట రవీంద్ర మోడల్ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం విద్యార్థుల హాజరుపై యం.ఇ.ఓ దిశానిర్దేశం మండల విద్యాధికారి యన్ శంకర్



**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోప్రభుత్వ రవీంద్ర మోడల్ ప్రాథమిక పాఠశాల శనివారం రోజు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.సమావేశంలో మండల విద్యాధికారి యన్ శంకర్ తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా బడికి హాజరు కావడం ఆ విద్యార్థి భవిష్యత్తుకు ఎంతో ముఖ్యమని తెలిపారుమీ పిల్లలను రోజూ తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలి. ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను ఇంటి వద్ద తల్లిదండ్రులు తిరిగి పునర్విమర్శ చేయాలి పిల్లలకు హోంవర్క్ చేయించడంతో పాటువారు నేర్చుకున్న అంశాలపై ప్రతిరోజూ అడిగి తెలుసుకోవాలిఅని సూచించారుపాఠశాల మరియు తల్లిదండ్రుల సమన్వయంతోనే విద్యార్థుల్లో పూర్తి స్థాయి అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారుపిల్లలు మొబైల్ ఫోన్ వినియోగించకుండాపిల్లలకు చదువుకు అవసరమైన వాతావరణం ఇంట్లో కల్పించాలని కోరారుఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత ఉపాధ్యాయ బృందం మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు తల్లిదండ్రులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారుపాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపునకు తల్లిదండ్రుల సహకారం కోరినట్లుప్రధానోపాధ్యాయురాలు సరిత తెలిపారు.

# గ్రామీణ వైద్యులపై... దాడులు వెంటనే ఆపండి

**ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఎదుట మొర**



**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపి సీఎంపీ లపై దాడులను దాడులను తక్షణమే నిలిపివేయాలని లేనిచో ఆర్.ఎం.పి పిఎంపీలు ప్రత్యక్షంగా పరోక్షంగా ఆందోళనకు దిగుతామని ఆర్ఎంపి పిఎంపీలఅసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ పబ్బా చంద్రశేఖర్ తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తో కలిసి తో కలిసి ఎంపిల బృందం వినతిపత్రం ద్వారా తమ గోడును వెళ్ళబోసుకున్నారు. తరతరాలుగా గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యులు ప్రభుత్వ వైద్యులు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాలలో గ్రామీణ ప్రాంతాలకు శ్రీరామరక్ష వలె ప్రజల ప్రాణాలను కాపాడుతున్నామని వారికి చేదోడు వాదోడుగా ఉంటున్నామని ప్రతిసారి ఆర్.ఎం.పి పి.ఎం.పి లపై దాడులు చేసి కేసులు పెట్టడం వల్ల ఆర్థికంగాను చితికి పోతున్నామని రాష్ట్రవ్యాప్తంగా ఆర్ఎంపి పిఎంపీ లపై దాడులను నిలిపివేయాలని అక్రమంగా అక్రమంగా బనయించినటువంటి కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని దామోదర రాజనర్సిమ్మకు మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.పి పి.ఎం.పి వైద్యుల ప్రతినిధుల బృందం నాగభూషణం విష్ణు, జిబి ఋషి, శ్రీనివాస నాయక్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# "సర్" ప్రక్రియ సాఫీగా సాగేలా సహాయ కేంద్రాలు పని చేయాలి..!

**కాంగ్రెస్ శ్రేణులకు మందుముల పరమేశ్వర్ రెడ్డి పిలుపు**



**ఉప్పల్ నియోజకవర్గం వాస్తవ తెలంగాణ న్యూస్,/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ నియోజకవర్గం సర్ ప్రక్రియ సాఫీగా, వేగవంతంగా సాగేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ భారత్ నగర్ విజైత స్కూల్ వద్ద కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఈగ ఆంజనేయులు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ సహాయ కేంద్రాన్ని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి గురువారం పరిశీలించారు. నిజమైన ఓటర్లకు సర్ ప్రక్రియతో ఎలాంటి నష్టం లేకుండా చూడాలని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి అన్నారు. బీఎల్ఓతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లకు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ సి సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ గారు,తుమ్మల దేవి రెడ్డి గారు,సల్లా ప్రభాకర్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి,అఫ్గల్,బుత్కూరి మదన్ గౌడ్,నవీన్,రామ్ రెడ్డి,రవీందర్ రెడ్డి,కోమట్ రెడ్డి కృష్ణ రెడ్డి,ఇర్షాద్,నయీం,అఫ్రోజ్,ఆసిఫ్,వాహెద్ ,బంటి,ఈశ్వర్,విజయ్,మోసిన్, శ్రీనివాస్,మోహన్ నాయక్,ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# టీఎస్ఏసీఎస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి వినతి

**పెండింగ్ బకాయిలు, బీమా, ఐడీ కార్డులపై ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు విజ్ఞప్తి.**
**సానుకూలంగా స్పందించిన ప్రాజెక్ట్ డైరెక్టర్.**



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ( టీఎస్ఏసీఎస్ )లో పనిచేస్తున్న సిబ్బంది ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర నాయకులు శనివారం సాయంత్రం ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను హైదరాబాద్‌లోని కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 2024--26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 2026--27 తొలి త్రైమాసికం (ఏప్రిల్--జూన్) కాంటింజెన్సీ, ఔట్‌రీచ్ నిధులను విడుదల చేయాలని కోరారు. అలాగే గతంలో అమలైన విధంగానే ఔట్‌రీచ్ నిధులను సిబ్బంది జీత ఖాతాల్లోనే జమ చేసే విధానాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా టీఎస్ఏసీఎస్‌లో పనిచేస్తున్న అందరు సిబ్బందికి అధికారిక గుర్తింపు కార్డులు (ఐడీ కార్డులు) జారీ చేయాలని, నాకో/టీఎస్ఏసీఎస్ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రూప్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. సిబ్బంది విధి నిర్వహణ, ఆర్థిక భద్రత, సంక్షేమానికి సంబంధించిన ఈ సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని ప్రాజెక్ట్ డైరెక్టర్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బొద్దిరెడ్డి రమణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాముని.రాజేశ్వర్, దశరథ్, దుర్గం దిలీప్ కుమార్, గీత, రాజు, గోవింద్ రెడ్డి, అశోక్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రుల సహకారం అవసరం



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** విద్యార్థులు ఉన్నత్తులుగా ఎదగాలంటే తల్లిదండ్రుల సహకారం అవసరమని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని జెడ్పిజిఎచ్ఎస్ పాఠశాలలలో శనివారం ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బాధ్యతగా పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన చేస్తారని,విద్యార్థులు ఇంటికి వచ్చాక సరిగ్గా చదువుతున్నావా లేదా? హోంవర్క్ చేస్తున్నావా లేదా? ఏం చదువుతున్నావ్?అంటూ పిల్లలను అడగడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. అప్పుడప్పుడు పాఠశాలకు వచ్చి తమ కూతురు బాగా చదువుతున్నదా? అని తరగతి టీచర్ ను ఇతర ఉపాధ్యాయులను అడిగి తల్లిదండ్రులు తెలుసుకోవాలి అన్నారు. ఒకవేళ ఇంటివద్ద చదవకుండా, హోంవర్క్ చేయకుండా ఉంటే తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సలహాలు,సూచనలు ఇస్తేనే తప్పొప్పులు తెలుసుకొని విద్యార్థులను సక్రమ దారిలో పెట్టడానికి అవకాశం ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాష,కవిత,గౌరమ్మ,అనురాధ,సౌమ్య, ఫయీమ్,శ్రీకాంత్, హాస్టల్ వార్డెన్ రజిత, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ మోమెరిల్ అవార్డ్స అందించిన రీతూ శివపురి




**కూకట్ పల్లి జులై 18(వాస్తవ తెలంగాణ )** ట్విన్ సిటీస్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్ ఇండియా ఫ్రీడమ్ ఫైటర్స్ శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని లక్డికాపూల్ లోని వుడ్ బ్రిడ్జి గ్రాండ్ హోటల్ లో ఘనంగా నిర్వహించారు. ఫెమ్సిటీ హాస్పిటల్, క్రైమ్ టుడే న్యూస్, నైస్ డెవలపర్స్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రముఖ బాలీవుడ్, టాలీవుడ్ నటి మరియు మోడల్ రీతూ శివపురి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసారు. అనంతరం సమాజంలో ఉత్తమ సేవలను అందించిన జర్నలిస్టులకు, సమాజసేవలను చేస్తున్న వారికీ, బాంబ్ బ్లాస్ట్ లో గాయపడిన వారికీ షహీద్ ఈ అజాం భగత్ సింగ్ బెస్ట్ సర్వీస్ అవార్డ్స్ లను అందించారు. ఈ సందర్భంగా సూర్య ఉదయం తెలుగు దినపత్రిక తెలంగాణ ఎడిటర్ బాషా, కూకట్ పల్లి విలేకరి క్రాంతి కుమార్ లకు బెస్ట్ సర్వీస్ మెమోరియల్ అవార్డు ను ముఖ్య అతిధి, మరియు సయ్యద్ తాజుద్దీన్ , (టిసిఈయంఏ) అధ్యక్షుల చేతుల మీదుగా అందజేశారు.

# ధార్మిక క్షేత్రాల అభివృద్ధికి పెద్దపీట

రూ. 100 కోట్ల నిధుల కేటాయింపు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ





**నాగర్ కర్నూలు వాస్తవ తెలంగాణ** నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మద్దిమడుగు శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి దేవస్థానంలో సంతు సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఏర్పాటుతో పాటు, సేవాలాల్ దేవస్థాన అభివృద్ధి కొరకై రూ. 100 కోట్ల భారీ నిధులను ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారులు శ్రీ వేం నరేందర్ రెడ్డి మంజూరు చేసినందుకు వారికి టీపీసీసీ ఉపాధ్యక్షులు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హృదయపూర్వక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధుల కేటాయింపుతో మద్దిమడుగు క్షేత్రం మరింత ఆధ్యాత్మిక శోభతో విరాసిల్లడమే కాకుండా, గిరిజన సోదరుల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహారాజ్ భవ్య మందిర నిర్మాణానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చందు తదితర నాయకులు పాల్గొన్నారు.


# పోలీస్ జాగిలాల కోసం నూతన భవనాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ

## పోలీసు వ్యవస్థలో జాగిలాల పాత్ర కీలకం



**నాగర్ కర్నూల్ వాస్తవ తెలంగాణ** నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పోలీస్ జాగిలాల (డాగ్ స్క్వాడ్) భవనాన్ని శుక్రవారం సాయంత్రం జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ప్రారంభించారు. అత్యాధునిక వసతులతో ఈ నూతన కేంద్రాన్ని నిర్మించారు, నూతన భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న పోలీస్ జాగిలాల (జాగిలాల రకాలు, వాటి విధులు, శిక్షణ వివరాలు) రికార్డులను, ప్రస్తుత స్థితిగతులను రిజర్వ్ ఇన్స్పెక్టర్ (ఆర్ ఐ) జగన్ ఎస్పీ కి వివరించారు. జిల్లాలో ఉన్న పోలీస్ జాగిలాల వివరాలు: 1. బ్రూనో 2. బోల్ట్ 3. ధ్రువ 4. టీనా 5. జాస్మిన్ 6. రాడో 7. రాణా: అనంతరం జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ ఈ జాగిలాలు నేరాల అన్వేషణలో, నిందితులను పట్టుకోవడంలో, అలాగే విస్ఫోటక పదార్థాల గుర్తింపు, వీఐపీల బందోబస్తు తదితర క్లిష్టమైన రక్షణ విభాగాల్లో పోలీస్ జాగిలాల పాత్ర ఎంతో కీలకమైనదని, వీటికి అనువైన వాతావరణం, మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ నూతన భవనాన్ని అత్యాధునిక సౌకర్యాలతో అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ డిఎస్పి శ్రీనివాస్, సిఐ అశోక్ రెడ్డి , కొల్లాపూర్ సిఐ శంకర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ జగన్, రాఘవరావు, ఆర్ఎస్ఐలు ప్రశాంత్, శివాజీ, కళ్యాణ్, గౌస్ పాషా, రామ్ రెడ్డి, సిబ్బంది మరియు డాగ్ స్క్వాడ్ హ్యాండ్లర్లు పాల్గొన్నారు.

# "ప్రజా భద్రత పోలీసు బాధ్యత"






**నాగర్ కర్నూల్ వాస్తవ తెలంగాణ** నాగర్ కర్నూల్ జిల్లా ఎస్.పి. శ్రీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అచ్చంపేట పోలీసు స్టేషన్ పరిధిలోని పుల్జాల గ్రామంలో " శి టీం, ఆధ్వర్యంలో సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాభద్రత--పోలసు బాధ్యత" అనే ఈ కార్యక్రమంలో భాగంగా అచ్చంపేట ఇన్స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో మానవ అక్రమ రవాణా, నిర్బంధ కార్మిక వ్యవస్థ, అక్రమ దత్తత వంటి సమాచారం ఉన్నయెడల తప్పనిసరి పరిస్థితుల్లో 100 నంబరుకు సమాచారం ఇచ్చి సహాయం పొందాలని సూచించారు. "సైబర్ మోసాలకు లొంగకండి, ఆశలకు బలి కాకండి. ఒకవేళ సైబర్ మోసానికి గురై నష్టపోయినప్పుడు సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 సంప్రదించి సహాయం పొందండి అన్నారు. "డ్రగ్స్, గంజాయి, మద్యం, పేకాట -- ఇవి జీవితాలను నాశనం చేస్తాయి." డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాల తయారీ సరఫరా వినియోగం ఎక్కడైనా జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. "రోడ్డు భద్రత పాటించాలి -- మద్యం సేవించి వాహనాలు నడపకండి. "యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి. వారికి పెద్దలు ఆదర్శంగా ఉండి నాగర్ కర్నూల్ జిల్లాను నేర రహిత జిల్లాగా మార్చాలన్న జిల్లా ఎస్పీ శ్రీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఐపీఎస్ సంకల్పాన్ని వివరించారు. ప్రజలతో పోలీసుల భాగస్వామ్యం ద్వారా సమాజ శాంతిభద్రతలు మెరుగుపడతాయని, సమస్యలు ఉన్నచో నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. అదేవిధంగా షి టీమ్ ఇంచార్జీ విజయలక్ష్మి (ఏ ఎస్) మాట్లాడుతూ బాలబాలికలు చదువుపై దృష్టి పెట్టి, విలువలతో కూడిన జీవనవిధానంతో, క్రమశిక్షణతో కృషి చేయడం వలన ఉత్తమ భవిష్యత్తు లభిస్తుందని విద్యార్థులకు సూచించారు. రకరకాల పద్ధతులలోమాయమాటలు చెప్పి పిల్లలను, అమ్మాయిలను, యువతను, మహిళలను అక్రమ రవాణా చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, అలాంటి అనుమానితులు ఉంటే వెంటనే సంబంధిత పోలీసులకు, డయల్-100 లేదా శి టీం నం; 8712657676 కు ఫోన్ చేసి తెలియజేయాలని తెలిపారు. మన జిల్లా ప్రజలు ముఖ్యంగా యువత, విద్యార్థులు, బాలబాలికలు గొప్పగా ఎదగాలన్న జిల్లా ఎస్.పి. శ్రీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ గారి సందేశాన్ని పోలీసులు వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు. పోలీసు కళాబృందం సభ్యులు ఆటపాటలతో వివిధ సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. గంజాయి మొదలగు మత్తు పదార్థాల అక్రమ రవాణా మరియు వినియోగం వలన భవిష్యత్తులో యువత ప్రమాదంలో పడుతుందని, మత్తు పదార్థాల బారిన పడి ఎంతోమంది యువత భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారుతోందని, కొంతమంది యువత జల్సా జీవితంతో పాటు సులభంగా డబ్బు సంపాదన కోసం అక్రమ మార్గంలో గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలను(డ్రగ్స్) విక్రయిస్తూ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని తెలిపారు. అలాంటి నేరస్తులతో పాటు, మత్తు పదార్థాలను వినియోగించే వ్యక్తులకు చట్టపరమైన శిక్షలు తప్పవని, సమాజంలోని మనందరం కలిసికట్టుగా పనిచేస్తూ భవిష్యత్తులో నాగర్ కర్నూల్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చాలన్న జిల్లా ఎస్.పి. శ్రీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ సంకల్పాన్ని తెలియజేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు అమ్మకాల సమాచారాన్ని సంబంధిత పోలీసు స్టేషన్ కు గానీ, జిల్లా పోలీస్ కి గానీ లేదా 1908 సమాచారం ఇవ్వగలరని చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మీ పేరు మీద మా యాప్ లో లోన్ వచ్చిందని లేదా మీకు క్యూఆర్ కోడ్ పంపించి దానిని స్కాన్ చేస్తే మీకు డబ్బులు వస్తాయని చెప్పిన యెడల నమ్మకండి. అది సైబర్ మోసం అని తెలుసుకోండి. ఇంటర్నెట్లో ఓటీపీ నంబర్ గానీ బ్యాంక్ కార్డ్స్ నంబర్ గానీ ఎవరికీ పంపవద్దని, ఒకవేళ ఎవరైనా సైబర్ నేరానికి గురైనట్లయితే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కి లేదా నాగర్ కర్నూల్ జిల్లా పోలీసుకి లేదా సంబంధిత పోలీసు స్టేషన్ కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాల్య వివాహాల వలన అనేక అనర్థాలుజరగుతున్నాయని, ఎవరూ బాల్య వివాహాలు చేసుకోవద్దని, ఎవరైనా అలా చేయాలని ప్రయత్నించినచో చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్-1098 కు ఫోన్ చేయాలని కోరారు. అలాగే యువత సామాజిక మాధ్యమాలు, మొబైల్ ఫోన్లు, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని మైనర్లు, లైసెన్సు లేనివారు, మద్యం తాగినవారు ఎలాంటి వాహనం నడపకూడదని, రోడ్డు ప్రమాదాల వలన అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, వాటిని మనందరం నివారించేందుకు కృషి చేద్దామని తెలిపారు. రకరకాల పద్ధతులలో మాయమాటలు చెప్పి పిల్లలను, అమ్మాయిలను, యువతను, మహిళలను అక్రమ రవాణా చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, అలాంటి అనుమానితులు ఉంటే వెంటనే సంబంధిత పోలీసులకు, డయల్-100 లేదా శి టీం నం; 8712657676 కు ఫోన్ చేసి తెలియజేయాలని తెలిపారు. మన జిల్లా ప్రజలు ముఖ్యంగా యువత, విద్యార్థులు, బాలబాలికలు గొప్పగా ఎదగాలన్న జిల్లా ఎస్.పి. శ్రీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ గారి సందేశాన్ని పోలీసులు వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు. షి టీం ఏ ఎస్ ఐ శ్రీమతి విజయలక్ష్మి, పద్మ (హెడ్ కానిస్టేబుల్), కానిస్టేబుల్ వెంకటేష్ నాయక్, మల్లేష్, సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ రవి కుమార్, ఎ హెచ్ టి యు టీమ్ సభ్యులు, కళాబృందం సభ్యులు బుద్దుల భాస్కర్ ఒ టీమ్, అచ్చంపేట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి నాయక్, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

# నల్లమల అడవి ప్రాంతంలోని శ్రీశైలం వెళ్లే ప్రధాన రహదారి పై పెద్దపులి ప్రత్యక్షం వాహనదారులు ఉత్కంఠం

**నాగర్ కర్నూలు వాస్తవ తెలంగాణ** నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ టైగర్ రిజర్ పరిధిలోని శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిపై శుక్రవారం సాయంత్రం పెద్దపులి ప్రత్యక్షమై వాహనదారుల్లో ఉత్కంఠత నెలకొల్పింది. అమ్రాబాద్ మండలం మన్ననూర్ నుంచి శ్రీశైలం వైపు వెళుతున్న వాదనదారులకు రహదారిపై పెద్ద పులి సంచరిస్తూ కనిపించి కొద్దిసేపు రోడ్డుపైనే నడుస్తూ కనిపించిన పెద్దపులిని చూసి ప్రయాణికులు తమ వాహనాలను నిలిపి దూరం నుంచి వీక్షించారు. అనంతరం పెద్దపులి అడవి ప్రాంతంలోకి వెళ్లిపోవడంతో వాహనదారులు పిలుచుకున్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో అడవి జంతువులు సంచరించడం సహజమే అయినప్పటికీ రహదారిపై పెద్దపులి కనిపించడం అరుదైన ఘటనగా స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ అటవీ శాఖ సూచనలు తప్పనిసరిగా అనుసరించాలని అధికారులు సూచిస్తున్నారు.



# కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి

## ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్




**నాగర్ కర్నూలు వాస్తవ తెలంగాణ** సోనం వాంగ్ చుక్ సామాజికవేత్త నేటికీ 20 రోజులకు చేరిన నిరాహార దీక్ష చేపట్టిన కేంద్ర ప్రభుత్వం కు చలనం లేదని.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రసాద్ వెంటనే రాజీనామా చేయాలి, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం చారగోండ మండలం కేంద్రంలోని హమాలీ కార్మికుల,సిరసనగండ్ల గ్రామంలో తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంఘం ఏఐటియుసి అనుబంధ కార్మిక సంఘం గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు, ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలను రద్దు చేస్తూ కార్మికులకు పోట్ట గొడుతున్నారని కేంద్ర ప్రభుత్వం కార్మికులకు కర్షకులకు, అసంఘటిత, రంగ కార్మికులకు చాలా రకాలుగా బెనిఫిట్స్ ను రద్దు చేసే విధంగా ఉన్నాయని అన్నారు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చడం కోసం ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి తప్ప కార్మిక వర్గానికి ఇలాంటి ఉపయోగం లేదని అన్నారు, 1886 మే 1 తారీఖున ఆవిర్భవించిన ఏఐటియుసి కార్మిక సంఘం దేశంలోని మొదటి మొట్టమొదటి కార్మిక సంఘంగా అవతరించి భారతదేశంలో అనేక పోరాటాల ద్వారా కార్మికుల నాయకుల ప్రాణ త్యాగాలు చేసి 44 చట్టాలను సాధిస్తే ఇప్పుడు ఉన్న కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి ఎనిమిది గంటల , పని దినాన్ని కార్మిక చట్టాలు అమలు చేస్తే, ఇప్పుడు ఉన్న ప్రభుత్వం కార్మికుల పని 12 గంట మళ్లీ పెంచిందన్నారు, వెనకటి రోజులను గుర్తుచేసేలా ఉన్నాయని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని, కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేస్తానని చెప్పారు, కానీ ఇంతవరకు అమలు చేయలేదని, పర్మినెంట్ చేయలేదని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దేశ రాజధాని అయినటువంటి న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ పార్టీ, అండ్ సామాజికవేత్త సోనం వాంగ్ చుక్ నేటికీ 20 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రసాద్, రాజీనామా చేయకుండా,నీట్ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ ఆత్మ హత్యలు చేసుకుంటున్న చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న ఎన్డీఏ బిజెపి కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, రానున్న రోజుల్లో మరింత ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని, హిందూ మతం ముసుగులో చూసి చూడనట్లు వివరిస్తే రానున్న భవిష్యత్తులో పాతాళ లోకానికి పడిపోయే ప్రమాదం ఉంది కనుక ముందు జాగ్రత్త చర్యగా కేంద్ర ప్రభుత్వం ధర్మేంద్ర ప్రసాదు రాజీనామా చేయించి నిరాహార దీక్షను విరమింపజేసి భారతదేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఏఐటియుసి డిమాండ్ చేస్తున్నది, భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ పథకాలను అదేవిధంగా కార్మికుల విద్యార్థులకు కార్పొరేట్ విద్యను కార్పొరేట్ వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు, తాడూరు మండల కేంద్రంలో ఈనెల 26న జరిగే నాగర్ కర్నూల్ జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సిహెచ్ శ్రీనివాసులు, ఏఐటీయూసీ చారగొండ మండల కార్యదర్శి వెంగిల్లా శ్రీనివాసులు,సిరిసనగండ్ల గ్రామ భవన నిర్మాణ కార్మికులు కొండల్, నరేష్ ఏం జంగయ్య, రమేష్, చారగొండ ఏఐటీయూసీ మండల కార్యదర్శి మొగిలి శ్రీనివాసులు, చారగొండ గ్రామ హమాలీ కార్మికులు గోరేటి రాములు, కీసరి వెంకటయ్య, బి.రామకృష్ణ ఎరుకల సైదులు, గోరటి గణేష్,తదితరులు పాల్గొన్నారు.

# లింగమయ్య కాలనీలో జన సమూహాల మధ్య నీటి కుంపటి పట్టించుకోని అధికారులు



**వాస్తవ తెలంగాణ** అమీన్పూర్ మున్సిపల్ కార్పొరేషన్ లో లింగమయ్య కాలనీ మురికి కుంపల మారింది. వర్షాలు వస్తే మురికి నీరు అంతా తమ ఇళ్లలోకి వస్తుందని అక్కడి గ్రామస్తులు తెలియపరిచారు.

ఇలా నీరు రావడం వల్ల , దోమలు , ఉండటంవల్ల చిన్నపిల్లలు, విష జ్వరాలకు గురవుతున్నారు,మున్సిపల్ అధికారులకు ఎంత చెప్పినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారి ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఇక్కడ ఉన్న రాజకీయ నాయకులు మాకు ఓటు వేయండి అభివృద్ధి చేసి చూపిస్తాం అని ఇక్కడి నాయకులు ఓట్లు వేసేదాకా మా ఇళ్ళ చుట్టూ తిరిగి ఇప్పుడు మాత్రం ఒక్కరు కూడా కనిపించడం లేదు. అంటే గెలవకముందు ఒక మాట గెలిచాక ఇంకో మాట మాట్లాడుతున్నారు. ఇలా ఉండగా మున్సిపల్ సిబ్బందికి తెలియచేస్తే చేస్తాం చూస్తాం అంటున్నారు తప్ప ఇండ్లలోకి ఎంత నీరు వచ్చిన మమ్మల్ని పట్టించుకోవడం లేదు అని ప్రజలు తెలియజేస్తున్నారు.

# చలో సరూర్నగర్ యువ సంగ్రామం సదస్సు



**వాస్తవ తెలంగాణ** సదస్సులోహైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'యువ సంగ్రామ సదస్సు' కార్యక్రమానికి పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తో కలిసి బీఆర్ఎస్ నాయకులు మైనార్టీ నాయకులు మహమ్మద్ షకీల్ లడ్డు కలీం ప్రశాంత్ విజయ్ జునేద్ ఒసేయ్ సరూర్‌నగర్‌కు బయలుదేరారు.

# శ్రీ జగన్నాథ రథోత్సవంలో పాల్గొన్న12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత



**వాస్తవ తెలంగాణ** సదాశివపేటపట్టణంలోని ది మాస్టర్ మైండ్ ఈ–టెక్నో స్కూల్ వారి ఆధ్వర్యంలో 2026 జూలై 17న నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి గౌరవనీయులైన వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, కౌన్సిలర్లు పులిమామిడి మమత రాజు, ఎర్ర విశాలి, సంక్షయ్ గౌడ్, ప్రముఖులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారితో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై రథ యాత్రను విజయవంతం చేశారు. ఈ పవిత్ర రథయాత్ర అయ్యప్ప స్వామి ఆలయం నుండి ప్రారంభమై, ది మాస్టర్ మైండ్ ఈ–టెక్నో స్కూల్ వరకు భక్తిపూర్వకంగా కొనసాగింది. వందలాది మంది భక్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొని ఈ మహోత్సవాన్ని ఆధ్యాత్మిక వేడుకగా తీర్చిదిద్దారు. రథయాత్ర సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా "హరే కృష్ణ" నామసంకీర్తనలు చేస్తూ, భజనలు, కీర్తనలతో భక్తిమయ వాతావరణాన్ని సృష్టించారు. మహిళలు సంప్రదాయ కోలాటం ప్రదర్శించగా, పురుషులు హరే కృష్ణ నృత్యంలో ఉత్సాహంగా పాల్గొని యాత్రకు మరింత శోభను చేకూర్చారు. రథయాత్ర ముగింపులో పాల్గొన్న భక్తులు, అతిథులు, ప్రజలందరికీ ప్రసాదం (అన్నదానం) అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా భక్తి, ఐకమత్యం, సేవాభావం, భారతీయ సంస్కృతి మరియు ఆధ్యాత్మిక విలువలను చిన్నారులు, కుటుంబ సభ్యుల్లో పెంపొందించే లక్ష్యాన్ని విజయవంతంగా సాధించారు. ఈ శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం సదాశివపేట ప్రజల హృదయాలలో చిరస్మరణీయమైన ఆధ్యాత్మిక వేడుకగా నిలిచింది. ఈ కార్యక్రమం ప్రిన్సిపల్ ఎం. నవనీత, కరస్పాండెంట్ సంతోష్, వైస్ ప్రిన్సిపల్ వీణావాణి అధ్యాపక బృందం నందిని, లక్ష్మి, భాను, లక్ష్మి ప్రసన్న, మీన, నాగ లక్ష్మి, ప్రవీణ్, డాన్స్ మాస్టర్ శ్రీనివాస్ మొదలగు వారు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహన దొంగల ముఠా ను అరెస్టు చేసిన శామీర్ పేట్ పోలీసులు




**మేడ్చల్ వాస్తవ తెలంగాణ** శామీర్ పేట్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాలాజీ నగర్ ఏసీపీ చక్రపాణి మాట్లాడుతూ, వరుస ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల అంతర్‌జిల్లా వాహన దొంగల ముఠాను షమీర్‌పేట్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి మొత్తం తొమ్మిది దొంగిలించిన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. జూలై 17/18 అర్ధరాత్రి తూముకుంట గ్రామంలోని దొంగల మైసమ్మ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు, నేర నివారణ గస్తీ నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, శామీర్ పేట్, కీసర, కుషాయిగూడ, మునుగూరు (ఖమ్మం), పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన పలు ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో వీరి ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ప్రధాన నిందితుడు నల్లగండ్ల నవీన్ రాజ్ అలియాస్ బన్నీతో పాటు ముగ్గురు బాల నేరస్తులు కలిసి ముఠాగా ఏర్పడి పథకం ప్రకారం బైక్‌లను చోరీ చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. నిందితుల వద్ద నుంచి పల్సర్, బుల్లెట్, డ్యూక్, అవెనిస్, యాక్టివా తదితర మొత్తం తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసును ఛేదించిన శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఏసీపీ చక్రపాణి అభినందించారు.

# కదం తొక్కిన అమీన్‌పూర్.. యువ సంగ్రామం సదస్సుకు పోటెత్తిన గులాబీ దండు

**కేసీఆర్ నాయకత్వం కోసం తెలంగాణ ప్రజల ఎదురుచూపు**
**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో**
**రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయం**
**అమీన్ పూర్, బీరంగూడ డివిజన కార్పొరేటర్ల స్థానం బీఆర్ఎస్ దే..**
**మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి**

**అమీన్‌పూర్ : వాస్తవ తెలంగాణ** అమీన్‌పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలో గులాబీ శ్రేణులు కదం తొక్కాయి. చీమల బార్లు తీరినట్లుగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు భారీ ఎత్తున తరలివచ్చి అమీన్‌పూర్ ప్రాంతాన్ని గులాబీ మయం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన ప్రతిష్టాత్మక యువ సంగ్రామం సదస్సుకు పఠాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపు మేరకు అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ కాన్వాయ్‌తో తరలివెళ్లాయి. శనివారం ఉదయం నుంచే అమీన్‌పూర్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి నివాసం వద్ద బీఆర్ఎస్ శ్రేణుల కోలాహలం నెలకొంది. జిహెచ్ఎంసి పరిధిలోని అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్ల నుంచి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున ఆయన నివాసానికి చేరుకున్నారు. అక్కడ నుంచి ప్రారంభమైన భారీ వాహనాల ర్యాలీ కాన్వాయ్‌ను మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి గులాబీ జెండా ఊపి అధికారికంగా ప్రారంభించారు. ఈ ర్యాలీ అంతటా పార్టీ శ్రేణుల నినాదాలతో అమీన్‌పూర్ మార్మోగింది.

**రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయం: తుమ్మల**

ఈ సందర్భంగా తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అమీన్‌పూర్, బీరంగూడ కార్పొరేటర్ల స్థానాన్ని గులాబీ ఖాతాలో వేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలం చెక్కుచెదరలేదని, కార్యకర్తల ఉత్సాహమే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. "ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఇటు సామాన్యులు, అటు రైతాంగంతో పాటు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి." అని తుమ్మల పాండురంగారెడ్డి పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ సర్కారుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని తుమ్మల స్పష్టం చేశారు. మళ్లీ తెలంగాణలో అభివృద్ధి పండగ జరగాలన్నా, ప్రజా సంక్షేమం వర్ధిల్లాలన్నా గులాబీ బాస్ కేసీఆర్ నాయకత్వమే శరణ్యమని.. ఆయనకు తిరిగి పట్టంకట్టేందుకు తెలంగాణ ప్రజానీకం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్ల బీఆర్ఎస్ ముఖ్య నేతలు, వార్డు ప్రతినిధులు, యువజన విభాగం నాయకులు, భారీ సంఖ్యలో గులాబీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్,లుబిఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, టిపిఆర్ అభిమానులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.



# వరి వదిలి.. ఆధునిక సాగు



**కూరగాయల పంటతో లక్షల లాభం**

- డ్రిప్, మల్చింగ్‌తో 60శాతం నీటి పొదుపు
- 35 ఎకరాల్లో ₹45.5 లక్షల నికర ఆదాయం
- ఆధునిక సాగు పద్ధతులతో అధిక లాభాలు
- జనగామ రైతు శ్రీనివాస్ విజయగాథ

పెరుగుతున్న సాగు వ్యయాలు, నీటి కొరతను అవకాశంగా మలుచుకుని వరి సాగుకు బదులుగా కూరగాయల సాగు చేపట్టి లక్షల్లో ఆదాయం ఆర్జిస్తున్న జనగామ జిల్లా లింగాల గణపురం మండలం కళ్యాణ్ గ్రామానికి చెందిన ప్రగతిశీల రైతు నక్కిర్త శ్రీనివాస్ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. 35 ఎకరాల్లో గతంలో వరి సాగు చేసిన శ్రీనివాస్‌కు రూ.17.50 లక్షల పెట్టుబడిపై రూ.22.75 లక్షల స్థూల ఆదాయం మాత్రమే లభించగా నికర లాభం రూ.5.25 లక్షలకే పరిమితమైంది. అనంతరం బీరకాయ, సొరకాయ, దోసకాయ, వంకాయ, టమాట, మునగ తదితర కూరగాయల సాగు చేపట్టి మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రూ.42 లక్షల పెట్టుబడితో రూ.87.50 లక్షల స్థూల ఆదాయం, రూ.45.50 లక్షల నికర లాభం సాధిస్తున్నారు. వరి సాగుతో పోలిస్తే పలుమార్లు అధిక ఆదాయం పొందుతున్నారు.

వాస్తవ తెలంగాణ

**పంటల వైవిధ్యీకరణతో..**

డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్, ఫర్టిగేషన్ వంటి ఆధునిక సాగు పద్ధతులతో 50-60 శాతం వరకు నీటిని ఆదా చేయడంతో పాటు ఎరువుల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. పంటల వైవిధ్యీకరణతో ఏడాది పొడవునా ఆదాయం పొందడమే కాకుండా స్థానిక కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. శ్రీనివాస్ విజయాన్ని ఆదర్శంగా తీసుకుని ఇతర రైతులు కూడా పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.